# కథ వ్రాయాలని.... ★

రచన :
వరికూటి రామక్రిష్ణా రెడ్డి

అనుకోకుండానే, అప్పటికప్పుడు ఏదైనా పనిచేయాలనితోస్తే, ఆ పని యప్పుడే చేసేవాణ్ణి. ఆ సమయం ఎటువంటిదైనా, అంటే ఆనందమయమైనా, దుఃఖమయమైనా కాని, ఏమైనాకాని, పట్టుదలమాత్రం వదిలేవాణ్ణిగాను. గట్టి పట్టుదలమనిషి అని నన్నప్పుడప్పుడు చుట్టాలు, స్నేహితులు అంటుంటూరు.

ఆరోజు సోమవారం. కాలేజి వుంది. సడన్‌గా ఏదైనా కథవ్రాయాలని తోచింది. పట్టుదలగల మనిషినిగదూ? సరే! కథ వ్రాయటానికి పూనుకున్నా. మొట్టమొదటి ప్రయత్నం కాబట్టి, కామెడీకథ వ్రాస్తామనుకున్నా. కథవ్రాయడం మొదలుపెట్టినా, హీరో హీరోయినులకు కాఫీహోటళ్లదగ్గర, సినిమాహాలుదగ్గర అనుకోని అత్యద్భుతసంఘటనలు పెట్టి, కథను సాఫీగా తమాషాగా వ్రాస్తున్నా, మధ్యమధ్య సిగరెట్లుత్రాగుతూ, మంచిభావాలతో కథను పూర్తిజేస్తున్నా. కథ పూర్తికావచ్చింది. ఇంక మిగిలింది ఆఖరుఘట్టము మాత్రమే! అక్కడమాత్రం మన కథకి బ్రేకుపడ్డది. ముగింపు ఎలా చేయటమా అని ఆలోచిస్తున్నా. కాని సరైనమార్గమేమీ కన్పించటంలేదు. చేతిలోనిపేపర్లు, పెన్ను పక్కనపెట్టి, బెడ్డుమీద మేనువాల్చి, సిగరెట్టు త్రాగుతూ తెగ ఆలోచిస్తున్నా. ఎంత దీర్ఘంగా ఆలోచించినా, సమస్య మాత్రం తీరటంలేదు. అట్లే ఆలోచనలోపడి, నాకు తెలియకుండానే నిద్రపోయినా, ఎంతసేపు నిద్రపోయానో ఏమొ తెలియదు.

నిద్రనుండి లేచి చూసేసరికి నేను కథవ్రాసినపేపర్లక్కడ లేవు. పేనామాత్రం వుంది. కాని పేపర్లు లేవు. ఎట్లపోయినాయో, ఏమొగాని నాకేమి గోచరించటంలేదు. నిజంగా అటువంటికథ పోయినందుకు నాకుఏడ్పు వచ్చింది. దాన్నిపైకిరాకుండా అణచుకున్నా. ఇంతలోకే నాకు రూముయిచ్చినామె, నా రూములోకి వచ్చింది. ఆమె యంత పాతకాలం మనిషిగాదు. కొత్తకాలం మనిషీ గాదు. నడిప్రాయం వయస్సు వుంటుంది. కొంచెం యింగ్లీషు తెలుసు. ఆ తెలిసిన యింగ్లీషు మాటల్ని సమయ సందర్భము లేకుండా వుపయోగిస్తుంది. ఆమె సరాసరిగ నాదగ్గరికొచ్చి, చేతిలోని పేపర్లను నాముందరేస్తూ "కథ ఏమంత డీసెంట్‌గా లేదు. చాలా న్యూసెన్సుగా వుం"దంది. నేనంతటితో నిరుత్సాహపడక "ముగింపులో చాలా బాగుంటుం"దన్నా. ఆమె నా మాటల్ని లెక్కచేయనట్లుగా, నిర్లక్ష్యంగా వెళ్ళిపోయింది. అయినా కథలవిషయ మీమె కేమి తెలుసనుకున్నా.

నిద్రమొహం కడుక్కొని, కాఫీ త్రాగి వచ్చి మళ్ళీ కథవ్రాయటం మొదలెట్టినా. కథ నడకను, పొందికనుగూర్చి నాలో నేనే సంతోషిస్తూ వ్రాస్తున్నా. ఇంతలోకే వాకిలి దగ్గర చప్పుడయింది. "ఎవరువార"న్నా. జవాబులేదు. మళ్ళీ రెండవసారి పిల్చినా. కాని జవాబులేదు. విసుగుతో, పేపర్లక్రింద బెట్టి సగంకాల్చి క్రిందపెట్టిన సిగరెట్టు మళ్ళీ నోట్లోపెట్టుకొని పీల్చుతూ వాకిలి తీసినా. ఇంకేముంది? నా కాశ్చర్యం, భయం రెండు వొక్కసారి కల్గినాయ్. ఆ వచ్చిన పెద్ద మనిషి మా నాన్నగారే! ఆయన్ని చూడగానే, నోట్లోని సిగరెట్టు క్రిందపడిపోయింది. ఆయన అప్పటి కోపరూపాన్ని చూచి, నేను నిలబడలేకపోయినా. ఆయనకళ్ళు నన్నమాంతం మ్రింగేటట్లు చూస్తున్నాయ్. ఆయన లోపలికొచ్చాడు. నావైపుకోపంగాచూస్తూ, 'కాలేజికి ఎందుకుపోలేదు? ఏంచేస్తున్నావ్?' అన్నాడు. నాకేమి చెప్పటానికి తోచటం లేదు. నోటమాటగూడ రాలేదు. అలాగే బిక్కమొహంతో నాయన్ను చూస్తున్నా. ఆయన రూమంతా నొక్కసారి కలయజూచి, కథవ్రాసిన పేపర్లమీదికి దృష్టిపోనిచ్చాడు. ఆయన మళ్ళీ నావైపు చూచాడు జవాబు కోసం. నేను లేనిధైర్యాన్ని తెచ్చుకొని, మెల్లగా "లేదు నాన్నా కథలువ్రాస్తే మంచి పేరు వస్తుందని........"

"అట్లని, కాలేజికి పోకుండా, నెలనెలకి బోలెడంత డబ్బు తగలెట్టా, వందలు వందలు జీతాలుకట్టి, చదువుమానేసి కథలు వ్రాస్తూ కూర్చున్నావా? ఏం కథల్రా అవి? నీ మొహంలో కథలా? వెధవా?" అన్నాడు కోపంగా గుక్క త్రిప్పుకోకుండా. నాకు మరింత భయమేసింది, అయినా ఎలాగూ తిట్లు తప్పవు అనుకొని "అది కాదు నాన్నా. కథలవల్ల మంచిపేరు వస్తుంది. అవసరం వీలయితే నీ పేరుకూడ వ్రాస్తాను. ఫలాని ఆయన కుమారుడు కథలు వ్రాస్తాడట అంటె నీకెంతపేరో చూడు" అని చెప్పబోతుండగా "నోరుమూయ్"అన్నాడు. అంతే. తర్వాత ఏమీ ప్రసంగం జరగలేదు.

మూడురోజులవరకు మానాన్న వున్నాడు. ఆ మూడురోజులు కథ ప్రసక్తి యెత్తుకోనే లేదు. అలాగే భద్రంగా మూలనయెత్తిపెట్టినా. మూడురోజులయినాయ్. మా నాన్న వెళ్ళిపోయాడు. యెత్తిపెట్టిన కథను దించి, పూర్తిచేసి, శుభదినమున మాసపత్రికకు పంపించినా. నా స్నేహితులందరికి నాకథను గూర్చి వివరించి చెప్పినా. వాళ్ళు నా కథ చదవటానికి యెంతో వుబలాటపడ్డారు. ఆ మాసపత్రిక యెప్పుడొస్తుందా, నా కథను యెప్పుడెపుడు ప్రచురిస్తారా యని యెదురు తెన్నులు చూస్తున్నా. దినాలు మందంగా గడిచిపోతున్నాయ్. ఒకరోజున ఆ మాసపత్రికవారినుండి నాకొక లెటర్ వచ్చింది. ఏమివ్రాసినారో యని ఆతృతపడినా. తీరా చూస్తే యేముంది? "ఇటువంటి కథలు మా ఆఫీసుకు పంపవద్దండి"అని ఎర్రసిరాతో పెద్ద అక్షరాలతో వ్రాసివుంది. దాన్నిచూడగానే నా ఆశలన్నీ నిరాశలైపోయినాయ్. హృదయంలో గందరగోళ మేర్పడింది. మనసు మారింది. కోర్కెలన్నీ గాలిలో మేడలైనాయ్......

మాసపత్రికలన్నీ వచ్చాయ్. నా మిత్రులు "ఏపత్రికలో కథ?" యన్నారు. నాకేమీ తోచటంలేదు. ఉన్నవిషయం చెప్పేటంత వరకు బలవంతం చేశారు. పత్రికపేరు చెప్పకుండా, జరిగినదంతా వున్నదున్నట్లుచెప్పినా. తర్వాత వాళ్ళుచేసిన హేళనకు, అవమానానికి అంతులేదు. అవమానంతో ఏలోకానికో క్రుంగిపోయినా. అప్పటినుండి కథ వ్రాయాలని బుద్ధే పుట్టటంలేదు. ఆ కోర్కె, పట్టుదల పూర్తిగా నశించిపోయినాయ్.